సామెతకథలు

# అష్టావక్రుడు

- శ్రీ ముసునూరి లక్ష్మీగణపతిశాస్త్రి.

తొల్లి ఏకపాదుడను ముని సుజాతయను నామెను పెండ్లాడెను. వారొక తపోవనమున నివసించియుండిరి. ఆముని అటకు వచ్చిన శిష్యులెల్లరకు సదాపాఠములు చెప్పుచుండెను. కొంతకాలమునకు సుజాత నిండు గర్భవతియయ్యెను. ఒకనాడు ఆమె గర్భములోని శిశువు "ఏమి? మా తండ్రిగారి ఛాందసము వింతగా ఉన్నదే! రాత్రింబవళ్ళిట్లు వేదపాఠములు చెప్పుదురేమి? వాండ్ర మెదడు సరిగా పని చేయునా? కాలక్రమములో వాండ్రు జడమతులు కారా?" యనుకొనెను. ఆ పలుకులు విన్న తండ్రి "ఓరీ! డింభకా! నీవు ఇంకా పుట్టలేదు. వేదాధ్యయనము విషయమై వక్రముగా నన్ను అధిక్షేపింతువా? నీవు ఎనిమిది వంకరలుగల దేహముతో పుట్టుదువుగాక" యని కొడుకునకు శాపమిచ్చెను. మరునాడు సుజాత భర్తను జేరి "ఓనాధా! మనయింట నేయి నూనెలు కాని, వడ్లుకాని మరి యేవిధములైన పురిటి సంభారాలు గాని లేవు, ఎట్లోగదా! నా యీ చింత తీర్చరా" అనెను.

అంత ఏకపాదుడు ధనమున్కై యజ్ఞముచేయుచున్న జనకమహారాజు పాలికి పోయెను. అచ్చట అతనికి వరుణపుత్రుడైన వందితో వివాదమేర్పడెను. మొదటవారు చేసుకొనిన నీమము ననుసరించి ఏకపాదుడు వాదమున ఓడిపోయిన వాడై జలమగ్నుడు కావలసివచ్చెను.

ఇట సుజాత అన్నయగు ఉద్దాలకముని యింట సుఖముగా ప్రసవించెను. కానీ తండ్రిశాపము ననుసరించి అష్టావక్రుడుగా పుట్టెను. అదే సమయమున ఉద్దాలకునకు శ్వేతకేతువనువాడు పుట్టెను. వీరిరువురు పన్నెండేండ్ల ప్రాయమునకే సమస్త విద్యలయందారి తేరి యుండిరి. ఒకనాడు అష్టావక్రుడు ఉద్దాలకుని తొడపై కూర్చుండి యుండెను. శ్వేతకేతువు వచ్చి "ఓరీ! నా తండ్రి తొడపై నెక్కితివేమిరా?" యని ఈవలకు లాగివైచెను. అంతనా అష్టావక్రుడు తల్లిని జేరి "అమ్మా! ఈయన నా తండ్రికారా? మరి నాతండ్రి ఎక్కడ?" అని అడిగెను. సుజాత తన భర్త వృత్తాంతము పూర్తిగా దెలిపెను. వెంటనే బావమరదులిద్దరు బయలుదేరి మిధిలకేగి యజ్ఞసభయందు తీర్చియున్న జనకమహారాజును దర్శించిరి. జనకుడు ఇంతటి బ్రహ్మవేత్తలున్న సభలో బాలురైన మీరెట్లు రాగలిగారు. ఎందుకు వచ్చినారు? అన "ఓ రాజా! తమ సభయందున్న వేదవాదులను వాదంబున గెలువ వచ్చినాము" అనిరి. జనకుని అనుమతి పొంది, పూర్వము తన తండ్రిని వాదమున నోడించిన వందిని వాదమునకు పిలిచెను. సర్వుల సమక్షమున అతనిని వాదమున గెల్చెను. అందువల్ల తన తండ్రి జలవిముక్తుడయ్యెను. సభలో రాజుచే అఖండ సన్మానముల పొంది తండ్రిని బావమరిదిని వెంటతీసుకొని వచ్చెను.

కావున, జ్ఞానులకు, పండితులకు శారీరక దోషములు ఒకనొకచో ఉన్నను అవి ఒక కళంకములు కాబోవని అష్టావక్రునికథ ఋజువు చేయుచున్నది. వాగ్భూషణమే సుభూషణము. *